# మోడీ వచ్చాకను పెరిగిన మొండి బకాయిలు

విజయవాడ,కార్పొరేట్ సంస్థలను కాపాడుకోవడానికి ప్రధాని నరేంద్ర మోడీ అబద్దాలు చెప్పడం విచారకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు.. ఒక ప్రముఖ ఛానల్ ప్రధానమంత్రితో నిర్వహించిన సమ్మిట్‌లో దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి లేదని, అభివృద్ధి పెరిగిందని, కాంగ్రెస్ పాలనలో అవినీతి పెరిగిందని చెప్పడం సత్య దూరమని ఆయన అన్నారు. ఎన్. పి. ఎ. కింద 16 లక్షల కోట్లు ఉన్నాయని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ స్వయంగా చెప్పారని, 2014 కంటే ముందు రెండున్నర లక్షల కోట్లు ఉంటే, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 16 లక్షల కోట్లకు అవి చేరుకున్నాయని నారాయణ ధ్వజమెత్తారు.. డబ్బులు ఎగవేతలో ఒక విజయ్ మాల్యా తప్ప, 28 మంది గుజరాత్ రాష్ట్రానికే చెందినవారని, ఎక్కువ మొత్తం బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే మొండి బకాయిల పేర్ల మీద కార్పొరేట్ వ్యక్తులకు డబ్బును మాఫీ చేశారన్నారు. భారతదేశంలో ఉన్న బిలియనీర్స్ బయటికి వెళ్లామని చెప్పారని, ఇదే దేశ సంపద తరలిపోయేదని కాదా? అని ప్రశ్నించారు. అభివృద్ధిలో భారతదేశం మూడో స్థానంలో ఉందని చెబుతున్నారని, కానీ 170 దేశాల ఆకలి సూచీలో భారతదేశం 112వ స్థానం ఉన్నదని, పేదల జీవన ప్రమాణాలు పెరగలేదని వాపోయారు. సత్వరమే కేసులు పరిష్కరిస్తు న్యాయని, ఆంధ్రప్రదేశ్‌లో ఒక చిన్నారిపై జరిగిన అఘాయిత్యం కేసు 20 రోజులలోనే ఉరి శిక్ష వేయించామని చెబుతున్న ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్లుగా ఆర్థిక కేసులు ఎదుర్కొంటూ జగన్ జైలు బయటనే ఉన్నారని, కోడి కత్తి కేసు, వైయస్ వివేకానంద రెడ్డి కేసులో ఉన్న ముద్దాయికి ఎందుకు శిక్ష పడటం లేదని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 60 కిలోల గంజాయి స్వాధీనం

ఏలూరు,ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితోపాటు అరవై కేజీల గంజాయి, ఎర్టిగా మారుతి కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆత్కూరు పోలీస్ స్టేషన్ లో ఎస్పీ ఆర్ గంగాధర్ మీడియాతో మాట్లాడుతూ..అందిన సమాచారం మేరకు పొట్టిపాడు టోల్ గేట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఈనెల 20వ తారీఖున ఎస్సై సురేష్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు.. అనంతరం ఉంగుటూరు తాసిల్దార్ సమక్షంలో పూర్తి తనిఖీలు నిర్వహించి కారులో మూడు బస్తాల గంజాయి బ్యాగులు ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకున్నారని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు శివారు సివిడి మామిడికి చెందిన వ్యక్తి వద్ద నుండి గంజాయి తరలిస్తున్నారు.. గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసాం.. అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి కర్నాటక రాష్ట్రం తరలిస్తుండగా మార్గ మధ్యలో పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నారు... 60 కేజీల గంజాయిని, ఎర్టిగా మారుతి కారును పట్టుబడ్డ ముగ్గురు నిందితులను కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు.

# షడ్రుచుల్లో ఔషధ ప్రభావం

తిరుమల,ఉగాది పచ్చడిలో ఉపయోగించే పదార్థాలన్నీ ఆరోగ్య పరిరక్షణకు ఉపయుక్తమయ్యే దివ్య ఔషధాలే. ఉగాది అనగానే పచ్చడి గుర్తుకు రావటం అతి సహజం. ఈ పచ్చడిలో ఉండే షడ్రుచులు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. అలాగే ఔషధ గుణాలూ ఉన్నాయి. ఉగాది పచ్చడి సేవనం వల్ల ఆరోగ్యం బాగుంటుందని నమ్మకం. ఉగాది రోజు మనం తినే ఆహారంలో షడ్రుచులు ఉంటాయి. వీటిలో ఏది లేకున్నా ఉగాది పచ్చడి సంపూర్ణం కాదు. ఆరోగ్యం పరిపుష్టం కోసమే ఇలా పెట్టారని పెద్దలు ఏనాడో చెప్పారు. మనశరీరం ఓ పద్ధతి ప్రకారం నిర్మితమై ఉంటుంది. అందుకే ఈ రుచులను సమపాళ్లల్లో ఎల్లవేళలా తీసుకోవచ్చు. శరీర అవయవాలు పనిచేయాలంటే దానికి తగ్గట్లుగా అవసరమైన ఆహారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే పండగల రోజు అయినా వీటిని ఖచ్చింతంగా ఇవ్వాలని పెద్దలు నిర్ణయించి పెట్టారు. ఆరోగ్యానికి హాని కలిగించే సూక్ష్మ క్రిములను సంహరించే శక్తి వేపపూతకి ఉందని అందరికీ తెలిసిన విషయమే. ఉగాది ఆరోగ్యకరమైన పండగానే చెప్పుకోవాలి. శక్తి పెరుగుతుందని అంటున్నారు. అంటే కష్టం వచ్చినా, సుఖం వచ్చినా సమానంగా స్వీకరించాలనే చక్కటి సూచన చేస్తూ మన పెద్దలు ఈ పచ్చడిని ప్రసాదంగా స్వీకరించే అలవాటును పెట్టారు. అయితే ఉగాది రోజు వీటన్నిటిని మిశ్రనమంగా పచ్చడి చేసుకుని తీసుకోడం ఆచారంగా వస్తోంది. ఉగాది రోజు చేసుకునే వంటకాలు, పచ్చడి వెనక ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. ఉగాది రోజున చేసే ఉగాది పచ్చడిలో అన్నీ ఆరోగ్య లక్షణాలు ఉంటాయి. తీపి, చేదు, వగరు, ఉప్పు, కారం, పులుపుల మేళవింపుతో చేసే ఈ పచ్చడి అందించే రుచుల్లో దాగివున్న ఆరోగ్య రహస్యాలు ఉన్నాయని వైద్యులు సూత్రీకరిస్తారు. ఈ పచ్చడి కోసం నోరూరని తెలుగువారు ఉండరు. ఆయుర్వేదం ప్రకారం షడ్రుచులు మధుర, ఆమ్ల, లవణ, ఉప్పు, కటు, తిక్త రసాలు. మధుర రసం అంటే తీపి కూడా శరీరానికి అవసరం. ఇది వాతాన్ని తగ్గిస్తుంది, అవయవాలకు శక్తినిస్తుంది. శరీరానికి బలం, వర్ణం ఇస్తుంది. పైత్యం, దప్పికలను తగ్గిస్తుంది. చర్మానికి, కంఠానికి మృదుత్వాన్నిస్తుంది. దీన్ని ఎక్కువగా తీసుకుంటే శరీరంలో కొవ్వు తద్వారా బరువును పెంచు తుంది. అధిక నిద్రకు దారితీస్తుంది. చర్మ సమస్యలు, క్రిములు పెరుగుతాయి. కఫాన్ని పెంచుతుంది. ఆమ్ల రసం అంటే పులుపు నోటిలో లాలాజలాన్ని పెంచుతుంది. ఆహారానికి రుచిని, శరీర పుష్టిని ఇస్తుంది. వాత, కఫాలను తగ్గిస్తుంది. శరీర బరువును నియంత్రిస్తుంది. మానసికోల్లాసాన్ని ఇస్తుంది. లవణ రసం చాలా తక్కువ ప్రమాణంలో తీసుకోవాలి. కణజాల పనితీరుకు లవణం అవసరం. జ్వరం, వడదెబ్బలు రాకుండా నివారిస్తుంది. వచ్చినప్పుడు లవణరసం ఉన్న పదార్థాలను తీసుకుంటే నీటిశాతం సమతుల్యం అవుతుంది. ఆహారం త్వరగా అరిగేటట్లు చేస్తుంది. విసర్జన సక్రమంగా ఉండేట్లు చేస్తుంది. దీన్ని మోతాదు మించి తీసుకుంటే గుండె, కిడ్నీలకు ప్రమాదం. ఉప్పు కఫాన్ని బయటకు పంపుతుంది. ఎక్కువైతే చర్మం, వెంట్రుకలు, దంతాలకు హాని చేస్తుంది. కారం శరీరంలోని కణాలను ఉద్రేకపరిచి, వేడిని పెంచుతుంది. మంటను పుట్టిస్తుంది. నోటిని పొడిబారేలా చేస్తుంది. ముక్కు, కళ్ల నుంచి స్రావాలను పుట్టిస్తుంది. అలసట, వాపు, శరీర వృద్ధిని తగ్గిస్తుంది. చెమటను శరీరంలోని కఫాన్ని తగ్గిస్తుంది. అధికంగా తీసుకుంటే వాపు, మంట, పోటును కలిగిస్తుంది. శుక్రహరం, దౌర్బల్యం. శరీర కాంతి తగ్గుతుంది. అందుకే కారం మితంగా వాడాలంటారు. చేదు ప్రధానంగా షుగర్‌ను కంట్రోల్ చేస్తుంది. ఇది మనసు, నాలుకలకు అయిష్టతను కలిగించినప్పటికీ శరీరానికి మేలు చేస్తుంది. నాలుకకు రుచిని పుట్టిస్తుంది. కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది. చర్మవ్యాధులను నివారిస్తుంది. గ్రంథుల స్రావాలను పెంచుతుంది.

# ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు.. కొత్త టార్గెట్ ఫిక్స్..! ఈసారి వ్యూహం ఏంటంటే

ముంబై:ఆర్ఎస్ఎస్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్. ఇప్పుడు తెలంగాణలో విస్తరించడమే టార్గెట్ గా పెట్టుకుంది. ప్రతి గ్రామంలో శాఖ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. సంఘ్ ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ఇటీవలే బెంగళూరులో జరిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఏం చేయబోతున్నారు? ఎలా విస్తరణకు ప్లాన్ చేశారన్నది ఇంట్రెస్టింగ్ గా మారింది. ముఖ్యంగా తెలంగాణలో మరింత బలపడేందుకు ఎందుకు ప్లాన్ చేశారన్నదే ఇప్పుడు అసలు మ్యాటర్.

1925 సెప్టెంబర్ 27న RSS ఆవిర్భావం

1925 సెప్టెంబర్ 27న నాగ్ పూర్ లో ఏర్పాటైంది. ఈ సెప్టెంబర్ 27 వస్తే వందేళ్లు. అంటే శతాబ్ది ఉత్సవాలు ఓ రేంజ్ లో ఉండేలా ప్లాన్ ప్రిపేర్ చేసింది. అంతే కాదు.. విస్తరణ కూడా ఎవరూ ఊహించని వేగంతో చేయాలనుకుంటోంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఈ మాస్టర్ ప్లాన్ అమలు చేయబోతోంది. ఇప్పుడు రాబోయే విజయదశమి రోజున చరిత్ర తిరగరాయాలని ఆర్ఎస్ఎస్ అనుకుంటోంది. తమిళనాడు మొదలుకుని కశ్మీర్ దాకా పథసంచలన్, శోభాయాత్రలు, ఘోష్ ఇవన్నీ చేయబోతున్నారు. ఈ ఏడాది దసరా నుంచి 2026 దసరా మధ్యలో శతాబ్ది వేడుకల కోసం సంఘ్ వేసుకున్న ప్లాన్ ఓ రేంజ్‌లో ఉంది.

గత నాలుగైదేళ్లుగా పెరిగిన సంఘ్ సభ్యత్వాలు

1925లో సంఘ్ ప్రారంభమైనప్పటి నుంచీ చాలా సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంది. దేశవ్యాప్తంగా మొత్తం 51,570 స్థలాల్లో %=రూ% రోజువారీ శాఖలు 83,129 నడిచేదాకా వెళ్లాయి. నాలుగైదేళ్లుగా శాఖలు, పాల్గొంటున్నవారి సంఖ్య దేశవ్యాప్తంగా పెరిగినట్లు సంఘ్ అంటోంది. గతేడాదితో పోల్చితే 10 వేలకు పైగా కొత్త శాఖలు ప్రారంభమయ్యాయన్నారు తెలంగాణ ప్రాంత కార్యదర్శి కాచం రమేశ్. వీటితో పాటు 32,147 వీక్లీ శాఖలు, 12,091 నెలవారీ శాఖలు నడుస్తున్నాయని, మొత్తంగా అన్నీ కలిపి 1,27,367 శాఖాపరమైన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

2026 దసరా నాటికి 4 వేలకుపైగా కొత్త శాఖలు టార్గెట్

అసలు విషయం ఏంటంటే.. తెలంగాణలో మరింత బలపడేలా వ్యూహం రచించింది సంఘ్. ఇప్పటికే ఇక్కడ బీజేపీ కొత్త జోష్ తో ఉంది. అలాంటి సమయంలో తెలంగాణలోని ప్రతి గ్రామంలో ప్రతి బస్తీలో సంఘ్ శాఖలు నిర్వహించేలా కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ప్రతి పల్లెలో ఉనికి ఉండేలా చూసుకుంటున్నారు. 2026 దసరా నాటికి తెలంగాణలో 4 వేలకుపైగా కొత్త శాఖలను స్థాపించాలనుకుంటున్నారు. ప్రతి ఇంటికి కరపత్రాలు పంపిణీ చేస్తూ, నవంబర్ లేదా డిసెంబర్ నెలల్లో రాష్ట్రంలో ప్రజాభిప్రాయ ప్రచారాన్ని కూడా ఆర్ఎస్ఎస్ మొదలు పెట్టబోతోంది.

ప్రతి ఇంటికి వందేళ్ల RSS గురించి కరపత్రాల పంపిణీ

ఇదో కొత్త యాంగిల్. తెలంగాణలో మొత్తం 1,839 ప్లేసుల్లో 3,117 శాఖలు నడుస్తుండగా గతేడాదితో పోల్చితే 392 కొత్త శాఖలు మొదలయ్యాయి. ప్రతీవారం జరిగే సాప్తాహిక్ మిలన్లు 382, నెలవారీగా 224 శాఖలు జరుగుతున్నాయన్నారు కాచం రమేశ్. ఇవన్నీ కలిపి తెలంగాణలో 3,800 పైనే సంఘ్ శాఖలు రన్ అవుతున్నాయి. ఈ %=రూ% శాఖల్లో యూత్, స్టూడెంట్సే ఎక్కువగా ఉంటున్నారు. కాబట్టి యూత్ టార్గెట్‌గా మరిన్ని కార్యక్రమాలకు సంఘ్ ప్లాన్ చేసుకుంటోంది.

గతేడాది తెలంగాణలో దసరా నాడు భారీ రూట్ మార్చ్

గ్రామీణ లేదా పట్టణ ప్రాంతాలలో 10 వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ఆ లెక్కన శాఖలకు ప్లాన్ చేస్తున్నారు. వీటితో పాటే స్లమ్స్‌లో సేవాబస్తీల పేరిట సంఘ్ విస్తరణ ప్రయత్నం చేసుకుంటున్నారు. అంటే హిందూ సొసైటీలో ఏ వర్గాన్ని కూడా పక్కన పెట్టకుండా అందరినీ కవర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. గతేడాది తెలంగాణలో విజయదశమి వేడుకల సందర్భంగా 161 ప్రదేశాలలో జరిగిన రూట్ మార్చ్‌లలో 50 వేల మందికి పైగా స్వయంసేవకులు పాల్గొన్నారు. ఇందులో 28 వేల మందికి పైగా స్వయం సేవక్స్ సంఘ యూనిఫామ్‌లో పాల్గొన్నారని తెలంగాణ ఆర్ఎస్ఎస్ శాఖ అంటోంది.

లక్షకు పైగా ప్రదేశాల్లో RSS శాఖల నిర్వహణకు ప్లాన్

సెప్టెంబర్ 2025 నుంచి అక్టోబర్ 2026 వరకు లక్షకు పైగా ప్రదేశాలలో ఒక వారం పాటు %=రూ% శాఖలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. సో దీన్ని ఆరెస్సెస్ బలోపేతం అన్న యాంగిల్ లోనే చూడ్డానికి వీల్లేదు. రాజకీయంగానూ ఫుల్ ఎఫెక్ట్ పెంచుకునేలా ప్లానింగ్ నడుస్తోందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే బీజేపీ తెలంగాణలో కొత్త జోష్ తో కనిపిస్తోంది. ఈ టైంలోనే ఆర్ఎస్ఎస్ అన్నిటికంటే ఎక్కువగా తెలంగాణలో విస్తరించే ప్లాన్ అంటే మ్యాటర్ వేరే లెవెల్ లో ఉందన్న టాక్ వినిపిస్తోంది.

RSS ట్రైనింగ్ ఇవ్వాలనుకుంటున్న ఐదు అంశాలేంటి?

ఈ సెప్టెంబర్ వస్తే ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు అవుతుంది. మరి ఈ వందేళ్లలో సంఘ్ ఏం చేసింది? నేడు దేశంలో 1 కోటి మందికి పైగా స్వయంసేవకులు ఉన్నారని చెబుతున్న సంఘ్ పెద్దలు ఎలాంటి ఫ్యూచర్ టార్గెట్స్ పెట్టుకున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న సామాజిక సమస్యలపై సంఘ్ ప్లాన్స్ ఎలా ఉన్నాయి? తమ అనుబంధ సంస్థలకు పొలిటికల్ ప్లాట్ ఫామ్ గా ఆరెస్సెస్ శాఖలు ఉపయోగపడుతున్నాయా? ట్రైనింగ్ ఇవ్వాలనుకుంటున్న ఐదు అంశాలేంటి?

హిందుత్వ భావజాల విస్తరణే లక్ష్యం

రాజకీయ పార్టీలతో పోలిస్తే ఆర్ఎస్ఎస్ ప్రణాళిక భిన్నంగా ఉంటుంది. హిందుత్వ




భావజాల విస్తరణే ప్రధాన లక్ష్యం అయినా సామాజిక అంశాలపై స్పందించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లడం సంఘ్ స్పెషాలిటీ. ఈ విషయంలో మరింత పదును పెట్టడం ద్వారా తెలంగాణ పల్లెల్లో జెండా ఎగరేయాలనేది ఆర్ఎస్ఎస్ తాజా ఆలోచన. కేవలం సంఘ్ భావజాల వ్యాప్తే కాదు.. ఇంకొన్ని లక్ష్యాలు కూడా ఇప్పటికే వారు పెట్టుకున్నారు. సామాజిక అంశాలైన ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, మొక్కల పెంపకం, జల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టడం, కులాల మధ్య అంతరాల వల్ల హిందుత్వ భావజాలానికి ఇబ్బందిగా మారిందన్న ఉద్దేశంతో ఈ విషయంలో కూడా ఫోకస్ పెంచుతున్నారు.

మహిళలను గౌరవించడం, రక్షణగా నిలబడడం

అంతే కాదు.. గ్రామ వికాస కార్యక్రమాల పేరుతో మద్యపానం తగ్గించడం, అక్షరాస్యత పెంపు, మహిళలను గౌరవించడం, వారికి ఆపద వస్తే రక్షణగా నిలబడడం, వలసల నివారణ, సేంద్రియ వ్యవసాయం, గోసంపద వృద్ధి, కుటుంబాల్లో మనస్పర్ధలు తగ్గించేలా, వృద్ధులను ఆదరించేలా, పాశ్చాత్య సంస్కృతిపై ఆకర్షణ తగ్గించేలా చేయడం, సోషల్ మీడియా అనర్థాలపైనా కార్యక్రమాల నిర్వహణ ప్రధాన లక్ష్యంగా ఉంది.

శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 5 అంశాలపై ట్రైనింగ్

తాజాగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 5 అంశాలపై యూత్ కు ట్రైనింగ్ ఇవ్వాలనుకుంటున్నారు. అందులో సామాజిక సామరస్యం, కుటుంబం, పూర్వీకులు కుల దేవత గురించి స్మరించుకోవడం, పర్యావరణ పరిరక్షణ, మాతృభాషలో మాట్లాడటం, భారతీయ సాంప్రదాయ దుస్తులు వేసుకోవడం, సంస్కృతిని కాపాడడం, ప్రజల బాధ్యతల గురించి తెలిపేలా శిక్షణ ఉండబోతోంది. సంఘ్ వందేళ్ల ఆవిర్భావ వేడుకల్లో భాగంగా %=రూ% ఆలోచనలు, భావాలను సమాజం వద్దకు తీసుకెళ్లేలా వచ్చే నవంబర్–డిసెంబర్–జనవరి నెలల్లో దేశంలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి వెళ్లడానికి జన సంపర్క అభియాన్ కార్యక్రమం జరగబోతోంది.

సంఘ్ లో 14-25 ఏళ్ల మధ్య వయసున్న వారి చేరిక

ఇందులో హిందూ సంస్థలకు భాగస్వామ్యం కల్పించి హిందుత్వాన్ని, ధర్మాన్ని సమాజంలోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తామంటున్నారు సంఘ్ పెద్దలు. గతేడాది సర్ సంఘచాలక్ మోహన్ భగవత్.. సంఘ్ కార్యకలాపాల విస్తరణ, ఏకీకరణ కోసం 2 ఏళ్లు కేటాయించే కార్యకర్తలను ఆహ్వానించారు. ఈ పిలుపుతో 2,453 మంది స్వయంసేవకులు తమ ఇళ్లు వదిలి పూర్తిస్థాయి సంఘ్ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. అటు సంఘ్ కార్యకలాపాల్లో చేరే యువకుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఏడాది, లక్షలాది మంది యూత్, ముఖ్యంగా 14-25 ఏళ్ల మధ్య వయసున్న వారే సంఘ్ లో చేరుతున్నారంటున్నారు.

విపత్తు సహాయాల్లో కీలకంగా ఆర్ఎస్ఎస్

ఆర్ఎస్ఎస్ అంటే సామాజిక సేవలో ముందుంటుందన్న అభిప్రాయం ఉంది. వరదలు వచ్చినా, భూకంపాలు వచ్చినా, కొండ చరియలు విరిగిపడ్డా.. సమస్య ఏదైనా విపత్తుల్లో సహాయాలు చేస్తూ స్వయం సేవకులు కనిపిస్తుంటారు. ఇలాంటి సేవా కార్యక్రమాల పట్ల యువతలో ఆసక్తి పెంచేలా కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. సమాజానికి సేవ అన్నది ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో ప్రధాన అంశం. ఇటీవల కుంభమేళలోనూ వచ్చిన వారికి కంటి పరీక్షలు చేయించడం, పర్యావరణ పరిరక్షణ కోసం ఏక్ థైలా ఏక్ థాలి ప్రచారం చేసింది సంఘ్. ప్లాస్టిక్ ప్లేట్లు, పాలిథిన్ బ్యాగుల వాడకం తగ్గించడానికి ప్రయత్నించింది.


సౌత్ నార్త్ రాజకీయ ప్రేరేపితం అన్న సంఘ్

ఇవే కాదు.. సౌత్ నార్త్ విషయాలపైనా సంఘ్ రియాక్ట్ అయింది. ఇది రాజకీయంగా ప్రేరేపితమైన విషయమన్నది. అలాగే మాతృభాష విషయంలోనూ స్పష్టత ఇచ్చింది. మాతృ భాషను విద్యలోనే కాకుండా మన దైనందిన జీవితంలోని అన్ని అంశాలలో ఉపయోగించాలన్నది ఆర్ఎస్ఎస్ మాట. మాతృ భాషపై ఆర్ఎస్ఎస్ ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది. బహుళ భాషలు నేర్చుకుంటే ఉపయోగమని, కెరీర్ లాంగ్వేజ్ ఇంగ్లీష్ అని నేర్చుకుంటే తప్పులేదన్నది. సో సంఘ్ మ్యాటర్ ఖుల్లం ఖుల్లాగా ఉంది.

తెలంగాణలో సంఘ్ విస్తరణకు అనుకూలంగా ఉందా?

దేశంలో కొన్ని ప్రాంతాలే ఆరెస్సెస్ కు పూర్తి అనుకూలంగా ఉన్నాయి. అందులో ప్రధానమైంది, ముఖ్యమైంది తెలంగాణే. అందుకే ఇక్కడ శాఖల విస్తరణకు బహుముఖ ప్రణాళికలు రచించారు ఆరెస్సెస్ పెద్దలు. భారీ టార్గెట్లు నిర్దేశించారు. అందుకే ఇటీవలే హైదరాబాద్ వేదికగా కీలక కార్యక్రమాలను సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2019లో హైదరాబాద్ లో నిర్వహించిన పథసంచలన్ ఒక వైబ్ క్రియేట్ చేసింది. పెద్ద ఎత్తున స్వయం సేవకులు ప్రధాన రోడ్లలో మార్చ్ ఫాస్ట్ నిర్వహించడం చూసి ఇక్కడ మరింత విస్తరణకు ప్లాన్ చేశారు. అయితే ఇది రాజకీయ పరంగానూ బీజేపీకి ప్లస్ అయ్యేలా ప్రణాళికలు నడుస్తున్నాయంటున్నారు.

# విద్యార్థులపై అమెరికా మరో బాంబు..




వాషింగ్టన్: అమెరికాలో విదేశీ విద్యార్థులపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం మరో బాంబు వేసింది. వందల మంది విద్యార్థుల వీసాలను రద్దు చేస్తున్నట్లు సంచలన ప్రకటన చేసింది. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ రాత్రికి రాత్రే వీసా రద్దు మెయిల్స్? పంపినట్లు కథనాలు వెలువడుతున్నాయి. వీసాలు రద్దయిన విద్యార్థులు తక్షణమే దేశాన్ని వీడాలని లేదంటే బలవంతంగా తరలిస్తామని ఆ మెయిల్స్‌లో హెచ్చరించింది. వీసాలు రద్దైన వాళ్లలో కొందరు భారతీయ విద్యార్థులు కూడా ఉన్నట్లు సమాచారం.

నిరసన తెలపడంతోనే ఇంటికి

యూనివర్సిటీలలో జరిగిన వివిధ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన అమెరికాలోని విదేశీ విద్యార్థులకు అక్కడి విదేశాంగ శాఖ మెయిల్స్ ద్వారా హెచ్చరికలు జారీ చేసింది. బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ వీసా నుంచి విదేశీ విద్యార్థులకు ఈమెయిల్స్ వెళ్తున్నాయి. స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఈమెయిల్స్ పంపింది. కేవలం ఆందోళనల్లో పాల్గొన్నవారికే కాకుండా అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన విద్యార్థులకు.. ఆఖరికి ఆ పోస్టులకు లైకులు కొట్టినవాళ్లకు కూడా ఈ హెచ్చరికలు పంపించింది.యునైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్, అమెరికా జాతీయచట్టంలోని సెక్షన్ 221(జీ) ప్రకారం.. మీ వీసా రద్దయింది. ఈ మేరకు స్టూడెంట్ ఎక్స్చేంజ్ విజిటర్ ప్రోగ్రామ్‌కు బాధ్యత వహించే అధికారులకు సమాచారం వెళ్లింది. మీ వీసా రద్దు అంశం గురించి సంబంధిత కళాశాల యాజమాన్యానికి వారు తెలియజేయవచ్చు . హెచ్చరిక సందేశాలు వచ్చినవారు.. తమ స్వదేశాలకు వెళ్లేందుకు సీబీపీ హోమ్ యాప్ ఉపయోగించుకోవచ్చని తెలిపింది. ఈ మేయిల్స్ అందుకున్న వారు విద్యార్థులు ఒక్కసారిగా కంగు తిన్నారు.. చదువును మధ్యలోనే ఆపి వేసి వారివారి దేశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

# మంచు విష్ణు కన్నప్ప విడుదల వాయిదా

హైదరాబాద్, మంచు విష్ణు హీరోగా రూపొందుతున్న మైథలాజికల్ చిత్రం 'కన్నప్ప'. అయితే ఈ సినిమా ఏప్రిల్ 25వ తేదీన విడుదల కావాల్సింది. కానీ, వివిఎఫ్ఎక్స్ పనులు ఇంకా మెరుగ్గా రావడం కోసం ఈ సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు- విష్ణు స్వయంగా ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఈ సినిమా ద్వారా అత్యున్నత ప్రమాణాలు కలిగిన సినిమాటిక్ అనుభూతిని కలిగించాలి.. అందుకు కొన్ని వారాల సమయం కావాలి. విఎఫ్ఎక్స్ పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ సినిమా కోసం మీరంతా ఎదురుచూస్తున్నారని తెలుసు కానీ, ఆలస్యం అవుతున్నందుకు విచారిస్తున్నాం. కన్నప్ప శివుడికి ఎంత గొప్ప భక్తుడో అందరికి తెలుసు.. అలాంటి భక్తుడి కథను అద్భుతంగా మీ ముందు తీసుకురావాలని అనుకుంటు-న్నాం. కొత్త విడుదల తేదీతో మీ ముందుకు వస్తాం' అంటూ మంచు విష్ణు పోస్ట్ చేశారు. కాగా, ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌బాబు, మోహన్‌లాల్, శరత్ కుమార్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎవిఎ ఎంటర్-టైన్‌మెంట్, 24 ఫ్రేమ్ ఫ్యాకర్టీ బ్యానర్లపై మోహన్ బాబు ఈ సినిమాని నిర్మిస్తున్నారు. మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేశ్ కుమార్ సింగ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు.

# ప్రియాంకను చూసి నేర్చుకోండి !

వయనాడ్ :కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక వాద్రా కు పరిచయమ అవసరం లేదు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సోదరి. అంతే కాదు, గతంలో రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహించిన వయనాడ్ ( కేరళ) నియోజక వర్గం ప్రస్తుత ఎంపీ ప్రియాంక. 2024 ఎన్నికల్లో రాహుల గాంధీ వయనాడ్ తో పాటుగా ఉత్తర ప్రదేశ్ లోని అమేథీ నియోజక వర్గం నుంచి పోటీ చేశారు. రెండు చోట్లా గెలిచారు. ఆ తర్వాత రాహుల్ గాంధీ అమేథీని ఉంచుకుని వయనాడ్ ను వదిలేశారు. సొంత నియోజక వర్గం అమేథీ ఎంపీగా కొనసాగుతు న్నారు. అలా రాహుల్ గాంధీ రాజీనామాతో ఖాళీ అయిన వయనాడ్ లోక్ సభ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో ప్రియాంక వాద్రా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. గెలిచారు. ఇప్పుడు, ఆమె వయనాడ్ ఎంపీ.అయితే ఇదంతా అందరికీ తెలిసిన విషయమే అయినా ఇప్పుడు ఆమె గురించి మాట్లాడుకోడానికి ఓ మంచి కారణమే వుంది. ఆమె ఓ మంచి బ్రేకింగ్ న్యూస్ చెప్పారు. ఆమె తమ నియోజక వర్గం ప్రజల మాతృ భాష మలయాళం నేర్చుకుంటున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా చెప్పారు. ఉప ఎన్నికల ప్రచార సమయంలో కేరళ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేంద్ర మాజీ మంత్రి ఏకే అంటోనీ ఇచ్చిన సలహా మేరకు తాను ప్రత్యేకంగా ఒక టీచర్ ను పెట్టుకుని మరీ మళయాళం నేర్చుకుంటున్నట్లు చెప్పారు. అంతేకాదు ఇప్పటికే తనకు మలయాళం కొంచెం కొంచెం అర్థమవుతోందని, కుంచెం కుచెం మాట్లాడగల్గుతున్నానని చెప్పారు. సంతోషం. అభినందనీయం. ఐదేళ్ళు అదే వయనాడ్ నియోజక వర్గానికి ప్రాతినిత్యం వహించిన రాహుల్ గాంధీకి మలయాళం ఎంత వచ్చునో, ఎంత రాదో మనకు తెలియదు కానీ, ఉప ఎన్నికల్లో గెలిచి ఇంకా ఐదు నెలలు అయినా కాక ముందే ప్రియాంక మలయాళం నేర్చుకోవడం అభినందనీయం. అన్నిటినీ మించి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల సమస్యలు తెలుసుకునేదుకు వారి మాతృ భాష నేర్చుకోవాలని ఆంటోనీ ఇచ్చిన సలహాను అక్కడే మరిచి పోకుండా ఆచరణలో పెట్టడం చాలా చాలా అభినందనీయం. సహజంగా ప్రజాప్రతినిధులకు తాము ప్రాతినిధ్యం వహించే' నియోజక వర్గం ప్రజల భాష వచ్చే ఉంటుంది. కానీ ఇదిగో ఇలా వలస వెళ్లి వేరే రాష్ట్రాల నుంచి పోటీ చేయవలసి వచ్చి నప్పుడే భాషా సమస్య వస్తుంది. ముఖ్యంగా ఉత్తరాది నాయకులు దక్షణాది రాష్ట్రాల్లో పోటీ చేసినప్పుడు భాషా సమస్యను ఎదుర్కుంటారు. గతంలో 1999లో కర్ణాటకలోని బళ్ళారి లోక్ సభ నియోజక వర్గం ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా, ఆ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, బీజేపీ అభ్యర్థిగా సుష్మా స్వరాజ్ పోటీ చేశారు. ఇద్దరికీ కన్నడం రాదు. సోనియా గాంధీ ఏ భాషలో మాట్లాడారో ఏమో కానీ, సుష్మాస్వరాజ్ మాత్రం పట్టుపట్టి కన్నడం నేర్చుకున్నారు. ఎన్నికల ప్రచార సభల్లో కన్నడంలో ప్రసంగించారు. అయినా ఆ ఎన్నికల్లో సోనియా గాంధీ గెలిచారు. సుష్మా స్వరాజ్ ఓడి పోయారు. ఓడిపోతే ఓడి పోయారు కానీ, ఆమె చాలా తక్కువ సమయంలో అంటూ 30 రోజులకంటే తక్కువ రోజుల్లో కన్నడ భాష నేర్చుకున్నారు. సరే ప్రజాప్రతినిధులు అందరూ సుష్మా స్వరాజ్ లా పక్షం రోజుల్లోనే పరాయి భాష నేర్చుకోలేక పోవచ్చును. పీవీ నరసింహ రావులాగా 14 భాషల్లో మాట్లాడలేక పోవచ్చును కానీ, తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంత ప్రజల భాష మాట్లాడ లేక పోవడం మాత్రం, ఆక్షేపణీయం. ఒక రకంగా అది వారికే అవమానం. కానీ తెలుగురాష్ట్రంలోనూ ప్రజల భాష తెలుగు రాని ప్రజాప్రతినిధులు ఉన్నారు. తెలంగాణ శాసన సభ విషయాన్నే తీసుకుంటే, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ 20 ఏళ్లకు పైగానే తెలుగు సభ లో ఎమ్మెల్యేగా ఉన్నారు. హైదరాబాద్ నగరంలోని పాత బస్తీలోని చాంద్రాయగుట్ట నియోజక వర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన మాత్రమే కాదు,ఆయన తండ్రి సుల్తాన్ సలాహుద్దీన్ ఒవైసీ, సోదరుడు అసదుద్దీన్ ఒవైసీ కూడా ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఉన్నారు. అయినా ఆయనకు గానీ, అయన కుటుంబ సభ్యులకు గానీ తెలుగు రాదు.ఇంగ్లీష్ లో అయితే అనర్గళంగా మాట్లాడతారు. అవసరం అనుకుంటే తమ ఓటర్ల కోసం ఉర్దూలోకి షిఫ్ట్ అవుతారు. కానీ తెలుగులో మాత్రం ఒక్క ముక్క మాట్లాడలేరు. మాట్లాడ లేక పోవడం మాత్రమే కాదు. కనీసం అర్థం చేసుకోలేరు. తెలుగు రాష్ట్రంలో పుట్టి తెలుగు రాష్ట్రంలో పెరిగి, 20 ఏళ్లకు పైగా తెలుగు శాసనసభలో సభ్యునిగా ఉండి మెజారిటీ సభ్యులు, మంత్రుల తెలుగు ఉపన్యాసాలు వింటూ కూడా ఆయనకు తెలుగు తలకెక్కలేదు. అయితే ఆయన మంత్రి సీతక్కకు ఉర్దూ, ఇంగ్లీష్ రాదని ఆక్షేపించారు. మంత్రికి ఇంగ్లీష్, ఉర్దూ రాదు, నాకు తెలుగు రాదు, పరస్పరం ఒకరిని ఒకరం అర్థంచేసుకోలేక పోతున్నాం. అంటూ తనకు తెలుగు రానందుకు క్షమాపణలు చెప్పారు. కానీ అదే సమయంలో ఆయన మంత్రి సీతక్కను అవమాన పరిచే విధంగా చేసిన వ్యాఖ్యలు వివాద మయ్యాయి. అయినా ఇప్పటికైనా ప్రియాంకను ఆదర్శంగా తీసుకుని అయినా ఒవైసీ సోదరులు తెలుగు నేర్చుకుంటారేమో చూద్దాం. నిజానికి ఒవైసీ సోదరులు మాత్రమే కాదు ప్రజల భాష రాని ప్రజా ప్రనిధులు ఇంకా ఉండే ఉంటారు. ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కు ఒరియా భాష రాదని అంటారు. అది ఎంత వరకు నిజమో కానీ ప్రజాప్రతినిధులకు ప్రజల భాష రావడం అవసరం. అది ఒవైసీలు కావచ్చును, మరొకరు కావచ్చును.

## 47 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల ప్రకటన

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నామినేటెడ్ పోస్టుల భర్తీపై కూడా ఫోకస్ పెట్టింది.. ఇప్పటికే మెజార్టీ పదవుల్లో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలను కూర్చోబెట్టిన ప్రభుత్వం.. మరో 47 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లను ప్రకటించింది.. 47 మార్కెట్ కమిటీలకు గాను మొత్తంగా సభ్యులతో కలిపి 705 నామినేటెడ్ పదవులు భర్తీ చేసింది.

# మూడోసారి అధ్యక్షుడయ్యేందుకు మార్గాలున్నాయ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏం చేసినా సంచలనమే అవుతుంది. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. తన పాలన ఎలా ఉంటుందో మరోసారి అందరికీ రుచిచూపిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన మూడోసారి కూడా అమెరికా అధ్యక్షుడు కావాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. తాను మూడోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి మార్గాలున్నాయని ఓ న్యూస్ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ విషయంలో తాను జోక్ చేయడం లేదని వ్యాఖ్యానించారు. ఇంటర్వ్యూలో భాగంగా మరోమారు అధ్యక్షుడు కావాలనుకుంటున్నారా..? అందుకు ఏమైనా వ్యూహాలున్నాయా..? అన్న ప్రశ్న ట్రంప్‌కు ఎదురైంది. ఇందుకు ఆయన సమాధానమిస్తూ.. 'రాజ్యాంగం అనుమతించకపోయినా.. మూడోసారి అధ్యక్షుడు కావడానికి చాలా మార్గాలు ఉన్నాయి. ఈ విషయంలో నేను జోక్ చేయడం లేదు. నన్ను మూడోసారి కూడా అధ్యక్షుడిగా చూడాలని చాలామంది కోరుకుంటున్నారు. అయితే, దాని గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటే అవుతుంది. ఆ విషయం మీకు కూడా తెలుసు' అని ట్రంప్ పేర్కొన్నారు.నిజానికి అమెరికా రాజ్యాంగం ప్రకారం ఏ వ్యక్తీ రెండుసార్లకు మించి అధ్యక్ష పదవిని అధిష్ఠించడానికి వీల్లేదు. ట్రంప్ మూడోసారి అధ్యక్షుడు కావాలంటే 22వ రాజ్యాంగ సవరణను మార్చాల్సి ఉంటుంది. దానికి అమెరికా కాంగ్రెస్‌తోపాటు రాష్ట్రాల ఆమోదం పొందాల్సి ఉంటుంది. అది చాలా కష్టమైన పని. అమెరికా చరిత్రలో ఫ్రాంక్లిన్ రూజ్ వెల్ట్ ఒక్కరే నాలుగుసార్లు



అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఇటువంటిది జరగకుండా నివారించడానికి 1951లో 22వ రాజ్యాంగ సవరణ తెచ్చారు.అయితే, ట్రంప్ మాత్రం మూడోసారి, వీలైతే నాలుగోసారి కూడా అమెరికాను ఏలాలని కలలు కంటున్నారు. మూడోసారి అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించడంపై ఆయన ఇప్పటికే పలు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి రెండుసార్లకు మించి దేశాధ్యక్ష పదవి చేపట్టేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించాలంటూ పాలక రిపబ్లికన్ పార్టీ కాంగ్రెస్ (పార్లమెంటు) సభ్యుడు యాండీ ఓగిల్స్ దిగువ సభలో ఇటీవలే సంయుక్త తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇది ఆమోదం పొందితే డొనాల్డ్ ట్రంప్ మూడుసార్లు అధ్యక్ష పదవికి ఎన్నిక కావడానికి వీలు కలుగుతుంది.

# 700 మంది ముస్లింలు మృతి.. 60 మసీదులు ధ్వంసం

మయన్మార్ దేశాన్ని అత్యంత శక్తిమంతమైన భూకంపం వణికించిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో భారీ సంఖ్యలో ముస్లింలు ప్రాణాలు కోల్పోయినట్లు మయన్మార్ ముస్లిం సంస్థ తాజాగా తెలిపింది. పవిత్ర రంజాన్ మాసంలో శుక్రవారం ప్రార్థనల సమయంలో 7.7 తీవ్రతతో సంభవించిన ఈ భూకంపం ధాటికి 700 మందికి పైగా ముస్లింలు మరణించారని వెల్లడించింది. అంతేకాదు దాదాపు 60 మసీదులు ధ్వంసమైనట్లు (%ఎశీంనబవం ఏవర్‌తీశీఎవఎ%) మయన్మార్ ముస్లిం నెట్‌వర్క్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు తున్ కీ సోమవారం తెలిపారు. అనేక మసీదులు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు.

%శుక్రవారం మధ్యాహ్నం సమయంలో నిమిషాల వ్యవధిలోనే సంభవించిన రెండు భూకంపాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ విపత్తులో ఇప్పటి వరకూ 1,700 మంది ప్రాణాలు కోల్పోయినట్లు మయన్మార్ స్టేట్ మీడియా నివేదిస్తోంది. అయితే, ఆ సంఖ్య 2,028 అని వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదించింది. దాదాపు 3,400 మంది గాయపడ్డారు. 300 మంది ఆచూకీ గల్లంతైంది. ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

**334 అణు బాంబుల విధ్వంసంతో సమానం**

మయన్మార్‌తోపాటు థాయ్‌లాండ్‌లో ఈ నెల 28న 12 నిమిషాల వ్యవధిలో



సంభవించిన రెండు భారీ భూకంపాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ భూకంపం 334 అణు బాంబులతో సమానమైన శక్తిని విడుదల చేసి వినాశనాన్ని సృష్టించిందని స్థానిక భూ విజ్ఞాన శాస్త్రవేత్త జెస్ ఫీనిక్స్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని భూప్రకంపనలు వచ్చే అవకాశముందని ఆమె హెచ్చరించారు. ప్రస్తుత విపత్తు కారణంగా మృతుల సంఖ్య 10 వేలు దాటే అవకాశముందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేస్తున్నది.

# విద్యుత్ శాఖలో రాజ్యమేలుతున్న అవినీతి?

**మీటరు కావాలంటే 35 వేలు.. ట్రాన్స్‌ఫార్మర్‌కు 3 లక్షలు.. ఎస్పీడీసీఎల్‌లో పనికో రేటు**

**లక్షలు లంచాలిచ్చి.. ఫోకల్ పోస్టుల్లో తిష్టవేసి**

**ఫిర్యాదులపై పట్టించుకోని ఉన్నతాధికారులు**

సిటీబ్యూరో, : మీటర్ కావాలంటే రూ.35 వేలు.. ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే కెపాసిటీని బట్టి రూ.50 వేల చొప్పున రూ.3లక్షలు.. ఇవి డిపార్ట్‌మెంట్ నిర్ణయించిన ధరలు కావు. కొందరు అధికారులు డిసైడ్ చేసిన రేట్లు. టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని గ్రేటర్ శివారు ప్రాంతాల్లో ప్రతి పనికో రేటు నడుస్తోంది. పని కావాలంటే ముందుగా పైసలు ఇవ్వాల్సిందే. లేదంటే ఆ ఫైలే ముందుకు పోదు. దక్షిణ డిస్కం పరిధిలో కొందరు విద్యుత్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్యానెల్ బోర్డులు బిగింపు మొదలుకొని మీటర్ల ఏర్పాటు వరకు అన్నీ తామే అయి వ్యవహరిస్తున్నారు. డీఈ, ఏడీఈ, ఏఈ స్థాయి అధికారులు ఒక పని చేయాలంటే తాము నిర్ణయించిన రేటు తమకు దక్కితేనే పనులు చేస్తూ లక్షలు జేబుల్లో వేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల డి.పోచంపల్లి ఏఈ సురేందర్‌రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు.

గత నెలలో కూడా గచ్చిబౌలి ప్రాంతంలో ఏడీఈ సతీశ్ అపార్ట్‌మెంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ప్రధానంగా శివారుప్రాంతాల్లోని కొన్ని ఏరియాల్లో పోస్టులకు భలే డిమాండ్ ఉంది. ఇక్కడ పోస్టింగ్ వస్తే ఆ అధికారి పంట పండినట్లేనని, అందుకోసం ఉన్నతాధికారులు, రాజకీయనాయకుల పైరవీతో పోస్టులు దక్కించుకుంటున్నారని విద్యుత్ శాఖ అధికారులే చెబుతున్నారు.




# ఆర్ఆర్ కెప్టెన్ రియాన్ పరాగ్‌కు 12 లక్షల జరిమానా

**ఆర్ఆర్ కెప్టెన్ రియాన్ పరాగ్‌కు 12 లక్షల జరిమానా**

గౌహతి: ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ స్టాండ్ ఇన్ కెప్టెన్ రియాన్ పరాగ్‌కు.. 12 లక్షల జరిమానా విధించారు. చెన్నైసూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో.. స్లో ఓవర్ రేట్ కారణంగా ఆ ఫైన్ వేశారు. ఉత్కంఠభరితంగా సాగిన ఆ మ్యాచ్‌లో ఆరు పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్ జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆర్ఆర్ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 182 రన్స్ చేసింది. అయితే భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన చెన్నై జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 176 రన్స్ మాత్రమే చేసింది. చెన్నై ఛేజింగ్ చేస్తున్న సమయంలో.. ఆర్ఆర్ జట్టు తమ ఓవర్ల కోటాను పూర్తి చేసేందుకు ఎక్కువ సమయం తీసుకున్నది. ఈ యేడాది ఐపీఎల్‌లో ఆర్ఆర్ జట్టు తొలి ఉల్లంఘనకు పాల్పడినట్లు నిర్వాహకులు తెలిపారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 కింద జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఓవర్ రేట్ స్లోగా ఉన్న కారణంగా, కెప్టెన్ పరాగ్‌కు 12 లక్షల జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఆర్ తన తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ చేతిలో ఓడిన విషయం తెలిసిందే. ఇక తన తదుపరి మ్యాచ్‌ను ఏప్రిల్ 5వ తేదీన పంజాబ్ కింగ్స్‌తో ఆడనున్నది.టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. నితీశ్ రాణా (36 బంతుల్లో 81, 10 ఫోర్లు, 5 సిక్సర్లు), కెప్టెన్ రియాన్ పరాగ్ (28 బంతుల్లో 37, 2 ఫోర్లు, 2



సిక్సర్లు) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ (2/28), పతిరాన (2/28), ఖలీల్ అహ్మద్ (2/38) రాజస్థాన్‌ను కట్టడి చేశారు.అనంతరం ఛేదనలో చెన్నై.. 20 ఓవర్లలో 176/6 వద్దే ఆగిపోయింది. రుతురాజ్ గైక్వాడ్ (44 బంతుల్లో 63, 7 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (22 బంతుల్లో 32 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్సర్) పోరాడినా ఆ జట్టుకు పరాభవం తప్పలేదు. హసరంగ (4/35) కీలక వికెట్లు పడగొట్టగా జోఫ్రా ఆర్చర్ (1/13) కట్టుదిట్టంగా బంతులేసి చెన్నైని ఆరంభంలోనే దెబ్బకొట్టాడు.

# ప్రకృతి అందించిన ఆరోగ్య ప్రదాయిని మందార..

మందార చెట్లు సహజంగానే మన అందరి ఇళ్లలోనూ ఉంటాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాదాపుగా ప్రతి ఇంట్లోనూ మందార మొక్క ఉంటుంది. ఇవి రంగు రంగుల పూలను పూస్తాయి. అయితే ఎరుపు రంగు రకానికి చెందిన ఒంటి రెక్క మందార పువ్వుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఈ పువ్వులను ఎండబెట్టి వాటిని నీటిలో వేసి మరిగించి డికాషన్‌లా తయారు చేసి తాగవచ్చు. అలాగే మందార ఆకులు కూడా ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మందార చెట్టు ఎల్లప్పుడూ పూలను పూస్తూనే ఉంటుంది. దీనికి పెద్దగా పోషణ కూడా అవసరం లేదు. తరచూ కొన్ని నీళ్లను పోస్తే చాలు, చెట్టు చక్కగా పెరుగుతుంది. ఈ చెట్లు మనకు ప్రతి సీజన్‌లోనూ పచ్చగానే కనిపిస్తుంటాయి. మందార పువ్వులను చూడగానే మనస్సుకు ఎంతోఆహ్లాదం కలుగుతుంది. మనస్సుకు ప్రశాంతత లభిస్తుంది. ఈ చెట్లను



కుండీల్లో కూడా పెంచవచ్చు.

# వాహనదారులకు అలర్ట్.. పెరిగిన ఓఆర్ఆర్ టోల్ చార్జీలు

హైదరాబాద్: హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డుపై టోల్ చార్జీలు మరోసారి పెరిగాయి. పెరిగిన చార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ వెల్లడించింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) నిర్వహణలో ఉండే ఓఆర్ఆర్‌ను ఐఆర్‌బీ సంస్థ రెండేండ్ల క్రితం 30 ఏండ్ల కాలానికి లీజు తీసుకుంది. నిబంధనల ప్రకారం ఏటా 5 శాతం వరకు టోల్‌ఛార్జీలను పెంచుకునే వెసులుబాటు సంస్థకు కల్పించింది. ఇందులో భాగంగా టోల్ ధరలను పెంచింది. దీని ప్రకారం కారు, జీపు, వ్యాన్, లైట్ వాహనాలకు కిలోమీటర్‌కు 10 పైసలు పెంచింది. దీంతో ప్రస్తుతం కిలోమీటర్‌కు రూ.2.34గా ఉన్న చార్జీలు రూ.2.44కు పెరిగాయి. అదేవిధంగా మినీబస్, ఎల్‌సీవీలకు కిలోమీటర్‌కు 20 పైసలు వడ్డించింది. దీంతో ప్రస్తుతం ఉన్న రూ.3.77 నుంచి రూ.3.94కు చేరింది. 2 యాక్సిల్ బస్సులకు కిలోమీటర్‌కు రూ.6.69 నుంచి రూ.7కు పెంచింది. భారీ వాహనాలకు కిలోమీటర్‌కు రూ.15.09 నుంచి రూ.15.78కు పెంచింది.ప్రతి ఏడాది ఏప్రిల్? 1న టోల్?చార్జీలను




సంస్థ పెంచుతూ వస్తున్నది. ఇందులో భాగంగా గతేడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జూన్ నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి వచ్చాయి. తాజాగా మరోసారి చార్జీలను పెంచింది.

# ట్రిపుల్‌ఆర్ నిర్మాణం మరింత ఆలస్యం.

హైదరాబాద్, : ప్రాంతీయ రింగురోడ్డు (ట్రిపుల్‌ఆర్) ఉత్తర భాగం నిర్మాణం మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తున్నది. రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటం, భూసేకరణ ప్రక్రియ ఇంకా పూర్తకాకపోవ డంతో కేంద్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. అందువల్లే ఏజెన్సీలను ఖరారు చేయడంలో జాప్యం జరుగుతోంది. ముఖ్యమ ంత్రితోపాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి ఇప్పటికే పలుమార్లు జాతీయ రహదారుల శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసినా ఎలాంటి పురోగతి లేకపోవడమే ఇందుకు నిదర్శనం. ట్రిపుల్‌ఆర్‌ను రెండు దశల్లో అభివృద్ధి చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో తొలుత ఉత్తర భాగాన్ని నిర్మించేందుకు టెండర్ల ప్రక్రియ చేపట్టినప్పటికీ దాఖలైన బిడ్లను మాత్రం తెరవడంలేదు. జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖతోపాటు పీపీపీ అప్రైజల్ కమిటీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తున్నది. దీంతో బిడ్లు తెరిచే గడువును ఇప్పటికే నాలుగుసార్లు వాయిదా వేశారు. భూసేకరణపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడం, పలుచోట్ల కోర్టు స్టే ఉత్తర్వు లు ఉండటంతో టెండర్ల విషయంలో తొందరపడరాదని కేంద్రం నిర్ణయించినట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి.బిడ్లు తెరిస్తే ఎంపికైన ఏజెన్సీకి పనులు కేటాయించాల్సి వస్తుందని, ఆ తర్వాత ఏ కారణంచేతనైనా అవి ముందుకు సాగకపోతే ఏజెన్సీలు పనులను నిలిపివేసి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతోపాటు భారీగా నష్ట పరిహారాన్ని డిమాండ్ చేస్తాయని, అందుకే అసలు బిడ్లే తెరవకుండా ఉంటే ఏ తలనొప్పీ ఉ



ండదని, భూసేకరణ పూర్తయ్యాకే పనులు చేపడదామని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు భావిస్తున్నారు.

దీనికి హైదరాబాద్-విజయవాడ రహదారిని ఉదాహరణగా చూపుతున్నారు.ఈ రహదారిని 8లేన్లుగా విస్తరించాలని ఒప్పందంలో ఉన్నప్పటికీ పనులు చేపట్టిన ఏజెన్సీ రాష్ట్ర విభజన వల్ల తనకు టోల్ వసూలు కావడంలేదనే కారణంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. పనులు నిర్వహించకపోవడంతో దాదాపు పదేళ్లపాటు ఈ రహదారి విస్తరణకు నోచుకోలేదు. తొందరపడి ట్రిపుల్ ఆర్ విషయంలో కూడా ఏజెన్సీని ఎంపికచేస్తే ఇలాగే జరుగుతుందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు భావిస్తున్నట్టు సమాచారం.

# 2 వేలు దాటిన మయన్మార్ భూకంపం మృతుల సంఖ్య.. 3 వేల మందికి గాయాలు

మయన్మార్ భూకంపం ఘటనలో మరణాల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ విపత్తులో 2,028 మంది మరణించినట్లు మయన్మార్ సైన్యాన్ని ఊటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదించింది. సుమారు 3,408 మంది గాయపడ్డట్లు పేర్కొంది. 300 మంది ఆచూకీ గల్లంతైనట్లు తెలిపింది. అయితే, మయన్మార్ స్టేట్ మీడియా మాత్రం 1700 మంది మరణించినట్లు వెల్లడించింది. మయన్మార్ దేశాన్ని అత్యంత శక్తిమంతమైన భూకంపం వణికించిన విషయం తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో నిమిషాల వ్యవధిలోనే సంభవించిన రెండు భూకంపాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఆ తర్వాత కూడా పలుమార్లు భూమి కంపించింది. ఇక ఈ విపత్తులో మయన్మార్ వ్యాప్తంగా రోడ్లు, వంతెనలు, ఎయిర్‌పోర్ట్‌లు దెబ్బతిన్నాయి. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాల కింద వేలాది మంది చిక్కుకుపోయినట్లు



అధికారులు అంచనా వేస్తున్నారు. వారిని సురక్షితంగా బయటకు తీసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ప్రస్తుత విపత్తు కారణంగా మృతుల సంఖ్య 10 వేలు దాటే అవకాశముందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేస్తున్నది.

# క్లింకార ఉగాది సెలబ్రేషన్స్.. ఎంత చక్కగా పూజ చేస్తుంది..!

రామ్ చరణ్, ఉపాసన ముద్దుల గారాల పట్టి క్లింకార గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. 2023 జూన్ 20న క్లింకార జన్మించగా, ఆ సమయంలో అభిమానులు పెద్ద ఎత్తున పండగలే జరిపారు. క్లింకార పుట్టగానే మెగా ఇంట పట్టలేని సంతోషం కనబడింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ %-% ఉపాసనల మొదటి బిడ్డగా, మెగా వారసురాలిగా క్లింకార జన్మించడంతో సంబరాలు అంబరాన్నంటాయి. అయితే క్లింకార పుట్టినప్పటి నుండి ఆ చిన్నారి ఫేస్ ఎలా ఉందో చూడాలని మెగా ఫ్యాన్స్ ఆరాటపడుతూనే ఉన్నారు. కాని క్లింకార ఏ ఫొటో షేర్ చేసిన కూడా అందులో క్లింకార ఫేస్ కనిపించకుండా జాగ్రత్త పడుతున్నారు. మెగా మనవరాలిగా, వారసురాలిగా క్లింకార ఇప్పటికే ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. చిన్నారికి క్లింకార అనే పేర పెట్టడం వెక కూడా ప్రత్యేకత ఉంది. ప్రపంచం మొత్తానికి శక్తిని ప్రసాదించే అమ్మవారి సహస్రనామాల్లో క్లిన్ కారా ఒకటి కాగా, అమ్మవారి అసమాన శక్తికి ఈ పదం అద్దం పడుతుంది. అపారమైన శక్తిని తనలో నిక్షిప్తం చేసుకుందనడానికి నిదర్శనంగా లలిత సహస్ర నామాల్లో క్లిన్ కారా అనే పేరును ఉపయోగిస్తారు. అంతటి



గొప్ప పేరును మెగా ప్రిన్సెస్ కు నామకరణం చేయడం విశేషం. కొణిదెల క్లింకార అనే పేరు ఇప్పుడు బ్రాండ్ అయిపోయింది.అయితే తాజాగా మెగా కోడలు ఉపాసన తన ఇంట్లో ఉగాది పండగ వేడుకలకి సంబంధించి ఓ వీడియో షేర్ చేసింది. ఇందులో ఉపాసన, క్లింకార, సురేఖలు పూజ మందిరంలో ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు కనిపించింది. అయితే ఇందులో క్లింకార ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారిని ఫేస్‌ని లవ్ ఎమోజీతో కవర్ చేసిన కూడా సైడ్ యాంగిల్‌లో కాస్త కనిపిస్తుండడంతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. బేబి పింక్ డ్రెస్ ధరించి పద్ధతిగా పూజలో కూర్చున్న క్లింకార ఫోటోలని నెటిజన్స్ తెగ వైరల్ చేస్తున్నారు.

# క్షిపణులతో సిద్ధమైన టెహ్రాన్

అణు ఒప్పందం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ . ఇరాన్ కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ తన అణు కార్యక్రమంపై వాషింగ్టన్‌తో ఒక ఒప్పందానికి రాకుంటే బాంబు దాడులు తప్పవని హెచ్చరించారు. అధ్యక్షుడి హెచ్చరికలతో అప్రమత్తమైన టెహ్రాన్.. క్షిపణులతో సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు స్థానిక మీడియా టెహ్రాన్ టైమ్స్ నివేదించింది.

ఆదివారం ఎన్‌బీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. 'ఒకవేళ అణుఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్ నిరాకరిస్తే.. బాంబు దాడులు తప్పవు. ఆ దేశం మునుపెన్నడూ చూడని రీతిలో దాడులు ఉంటాయి. టెహ్రాన్‌పై మరోసారి సుంకాలు విధిస్తాను' అని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ హెచ్చరికలతో అప్రమత్తమైన ఇరాన్.. దేశవ్యాప్తంగా ఉన్న భూగర్భ ప్రయోగ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో క్షిపణులను లాంచ్‌ప్యాడ్‌లపై సిద్ధంగా ఉంచినట్లు టెమ్రాన్ టైమ్స్ వెల్లడించింది. వైమానిక దాడుల కోసం వీటిని ప్రయోగించే అవకాశాలున్నట్లు తెలిపింది. అత్యవసర పరిస్థితుల్లో అమెరికా సంబంధిత ప్రాంతాలపై దాడులు చేసేందుకు ఈ క్షిపణులను ఉపయోగించే ప్రణాళిక ఉందని సదరు కథనం పేర్కొంది.

**2018లో ఇరాన్ తో ఒప్పందం రద్దు**



ట్రంప్ తన మొదటి 2017-21 పదవీకాలంలో ఇరాన్‌తో సంబంధాలు అంతంతమాత్రంగానే సాగించారు. ఒబామా హయాంలో కుదిరిన అణు ఒప్పందాన్ని కాస్తా 2018లో రద్దు చేశారు. అప్పటి నుంచి ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతన్నాయి. ఆ తర్వాత ఇరాన్‌పై ఆంక్షలు విధించడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. ఆ తర్వాత అనేక సంవత్సరాలుగా పరోక్ష చర్చలు ఫలించకపోవడంతో.. ఇటీవల ట్రంప్ మళ్లీ అణు ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. కానీ, ఈ విషయంలో ఇరాన్ వైఖరి యథాతథంగా కొనసాగుతుండటం ఉద్రిక్తతలకు తెరపడటం లేదు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ ఇలాంటి వార్నింగ్ ఇచ్చారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com